


# 15


**వి. ప్రతిమ**

మునెమ్మకి ఏదో ఒక ప్రత్యేకమైన, పారదర్శకమైన, లేతనీలపు గాజుగోళంలో వున్నట్టుగా వుంది... అది ఆకాశంతో.. సగం ఆకాశంతో కాదు... పూర్తి ఆకాశంతో చేసినట్టుగా ధృఢంగా, దర్పంగా, ధీమాగా వుంది.

అక్కడి నుండి చూస్తోంటే పాతాళబావిలో నుండి ఒక్కొక్క మెట్టూ పైకి ఎక్కి వస్తోన్న చిన్ని మునెమ్మ, ఎడప్రాయపు మునెమ్మ, యవ్వనపు మునెమ్మా విడతలు విడతలుగా దర్శనమిస్తున్నారు...

“చట్ట సభలలో సీట్లకోసం

# చిట్టచివరి మహిళ



భర్తలతోనే పోటీ చేసి... ఢిల్లీ సభలో పీఠం వేసీ.."

ఎక్కడో దూర తీరాలలో నుండి తేలివస్తున్నట్టుగా ఆపాట మునెమ్మ మస్తిష్కాన్ని కదిపింది...

ఆ మాటకొస్తే రాత్రంతా రైలు కుదుపులకో, డిశంబరు మాసపు చలి తెరలకో.. బయటిదో, లోపలిదో తెలీని అలజడికో ఆమెకి కంటి మీద కునుకు లేదు... ఇప్పుడే కన్నంటుకుంది.

అపరిమితమైన ఆనందం, అంతులేని దుఃఖం రెండూ మనిషిని అతలాకుతలం చేస్తాయేమో పరిపరి విధాలుగా...

ముడతలు పడి మంటపెడుతోన్న రెప్పల్ని అతి మెల్లిగా పైకి లేపి మూసి... మళ్ళీ తెరిచి, నులుముకుని మరేదో లోకంలో నుంచి అతికష్టం మీద బయటికొచ్చినట్లుగా పాట పాడుతోన్న కొండయ్యకేసి చూసింది.

ఇంకా తెల్లారినట్టులేదు.

అప్పుడే ఎంత ఆతృత... ఆర్భాటం దేనికో? పూర్తిగా విడివడ్డ కళ్ళని భర్తకేసి తిప్పి దీనంగానూ, ఒకింత తృప్తిగానూ చూసింది మునెమ్మ...

హఠాత్తుగా గ్రామ దేవత ముత్యాలమ్మ ప్రత్యక్షమయి

"నీకేం కావాలో కోరుకో కొండమ్మా" అంటే ఎంత ఉద్వేగంగా వుంటుందో సరిగ్గా అంత ఉద్వేగంలో వున్నాడతడు...

స్నాతకోత్సవంలో కాన్వొకేషన్ డ్రస్సు వేసి, టోపీ పెట్టి... డాక్టరేట్ చేతికొచ్చినంత ఆనందకరమైన అలజడేదో కమ్మేసినట్లుగా మళ్ళీ మళ్ళీ అదే పాట, అదే కూచిరాగం అతడి పెదాలమీద.

"లేచింది, నిద్ర లేచింది మహిళాలోకం" అంటూ.

ఇంకా నిద్రలేవని రైలు పెట్టె మత్తులో జోగులోంది ప్రశాంతంగా. ఈ అలజడంతా బయటిది కాదు, లోపలిదేనని గుర్తించింది మునెమ్మ... అయినా విసుగుని మిళితం చేసి

"ష్" అంది కోపంగా

పక్కవాళ్ళు వింటారని కావొచ్చు, నిద్రా భంగమవుతుందని కావొచ్చు సంజ్ఞ వుందందులో... అతడి ఉద్వేగం ఆమెకి ఇబ్బందికరంగా వుంది.

మనిషిలోపలి సమస్త ఉద్వేగాలనూ మోసుకుని విచిత్రంగా కూతపెడుతూ ముందుకు సాగుతోంది రైలుబండి...

ఆమె తల వల్మీకంలో కాసరబీసరగా అల్లుకుపోయిన ఆలోచనలు మళ్ళీ ఆమెని నిద్రకు దూరం చేశాయి.

"ఇన్ని విషయాలు... ఇంత వాగ్ధాటి నీకెలా సాధ్యమైంది మునెమ్మా? వెంకయ్యనాయుడు, అరుణ్ జైట్లీ వంటి వారంతా ఈ వాగ్ధాటితోనే కదా జాతీయస్థాయి నాయకులయ్యారు... నిజంగా ఒక ఆర్థిక శాస్త్రవేత్త, ఒక సామాజిక కార్యకర్త మాట్లాడినట్లుగా మాట్లాడావు... చాలా సంతోషం..."

నిన్న మధ్యాహ్నం హైదరాబాదులో సంయుక్త వారధి మీటింగు జరిగింది. అందులో తను మాట్లాడింది విని జనరాజ్యం పార్టీ అధినేత జయచంద్ర చేసిన అభినందన పదే పదే మునెమ్మ హృదయాన్ని వలయాలు వలయాలుగా చుట్టుకుపోతోంది...

నిజానికి అవన్నీ కూడ పెద్ద మాటలే

అవగాహన, వాగ్ధాటి, సామాజిక వేత్త వంటివి... కానీ ఏ మనిషికయినా జీవితమే ఎన్నో నేర్పిస్తుందనీ, వాటిని సరయిన సమయంలో సరిగ్గా పట్టుకోగలగడమే మనిషి చేయాల్సిన పననీ మునెమ్మ నమ్మకం...

ఇంత విమర్శ కూడ మునెమ్మకి చాలా ఏళ్ళ దాకా తెలీదు.

మునెమ్మకి ఎంత వయసుంటుందో చెప్పలేం.

ఎంతని అడిగితే ఆ ఫలానా కాలవ పొంగినప్పటికి, లేదా మా ఊరికి బస్సొచ్చేప్పటికి... కరెంటేసినప్పటికి 'నేనింతుండేదాన్ని' అంటూ ఎత్తు చూపిస్తుంది... కాబట్టి ఆమె వయసు ఎంతయినా కావొచ్చు...

మామూలు ప్రపంచంతో సంబంధంలేని మారుమూల ప్రదేశాల్లో కాలాన్ని నిర్ధారించడం కష్టమైన విషయమే...

"నేను వచ్చిందే ఆ వర్గం నుంచయినపుడు ప్రత్యేకంగా సామాజిక న్యాయం అనే మాట నేనెందుకు వాడాలి?... అసలా పదం గురించే నాకు తెలీదండీ... నాకు తెలిసిందల్లా మన చుట్టూ వున్న సమాజంలో, మా జిల్లాలో అదీ మా మండలంలో జరుగుతోన్న విషయాలు, జరుగుతోన్న పనులూ, ఏ మంచయినా, ఏ అభివృద్ధి అయినా అందరికీ సమానంగా జరగాలి, అందరికీ సమానంగా అందాలి... ఆడవాళ్ళకి అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలి. అదొక్కటే నాకు తెలిసింది..." మునెమ్మ సమాధానం విని జయచంద్ర డంగై పోయాడు...

మొత్తం రాజకీయాలని ఒక చిన్న వాక్యంలో పొదిగి అత్యంత సాధారణంగా చెప్పిన మునెమ్మ పట్ల అతడికి గౌరవం పెరిగింది... పార్టీ కార్యకర్తలతో మాట్లాడో, మాట్లాడకో, వెంటనే అతడో నిర్ణయానికొచ్చేశాడు...

మునెమ్మకి చదువురాదు... ఇప్పుడిప్పుడు అక్షరాలను గుర్తిస్తోంది... అయితే మునెమ్మకి బాగా వచ్చిందేమిటంటే మాట్లాడ్డం.. అందరినీ కలుపుకుపోయి.. మాట్లాడ్డం.. అందర్నీ మెప్పించేట్టుగా మాట్లాడ్డం... పొదుపులో వున్నప్పుడు కూడ ఈ మెప్పించే గుణమే ఆమెని నాయకురాల్ని చేసింది....

ఇప్పుడు జనరాజ్యం పార్టీ అధినేత జయచంద్ర చెప్తోన్న విధానాలలో ఆమెకి బాగా నచ్చింది కూడ అదే... ప్రేమతో, దయతో సామాజిక సేవ చేసుకుంటూ వెళ్ళడం... ప్రజలను మనస్ఫూర్తిగా నమ్మి వారిని తన కృషిలో, పయనంలో, ఫలితంలో భాగస్వాముల్ని చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడతడు...

మునెమ్మ ఆత్మవిశ్వాసం... విషయ పూరిత ధోరణి అతడిని బాగా ఆకట్టుకుని వుండొచ్చు. తన లక్ష్యంలో స్పష్టత కలిగిన జయచంద్ర వెంటనే ఆమె అంగీకారాన్ని తీసుకుని శాసనసభకి అభ్యర్థిగా ప్రకటించేశాడు.

ఒక్కసారిగా రాష్ట్రమంతటా తీవ్రమైన అలజడి.

"ఎవరీ మునెమ్మ" అంటూ మీడియాకి చెప్పలేనంత ఆతృత.

శాసనసభకి అభ్యర్థిగా ప్రకటించడానికి ఈమెకున్న అర్హతలేమిటి అన్న చర్చ కొండయ్య ఆతృతకీ, ఆర్భాటానికి తగినట్లుగానే వెలుగురేకలు విచ్చుకోకముందే రైలు నెల్లూరులో ఆగినట్టుంది... నిజానికి అది ఏవూరో మునెమ్మకి తెలీదు....

స్టేషనంతా విపరీతమైన కలకలం.

ఇంత ఉదయాన్నే యింతమంది మనుషులు ఎక్కడికి బయల్దేరి వెళ్తున్నారో, ఎక్కడెక్కడి నుంచి తిరిగి వస్తున్నారో అర్థం కాలేదామెకి.. ప్రతీవాళ్ళూ ఏదో తీవ్రమైన లక్ష్యంతో, ముందుకు సాగుతోన్న నదీ ప్రవాహంలా వున్నారు... కిటికీ కానుకుని వాళ్ళందర్నీ కన్నార్పకుండా చూస్తోన్న కొండయ్య ఉలిక్కిపడ్డాడు.

"అనోఁ కొండన్నా ఈడుండారా?... అదంతా ఎతకతుండా" అంటూ కిటికీ కానుకుని వున్న కొండయ్యని గుర్తించి గబగబా కంపార్టుమెంటులోకి ఎక్కి వచ్చింది చెంద్రమ్మ... వాకాడు పక్కన కొత్తపేటలో వుంటుందామె...

అప్పటికే పైకి లేచి దుప్పటి మడతేస్తోన్న మునెమ్మ చెంద్రమ్మని విస్తుపోయి చూస్తూ "ఈ డ్యాడ్నుంచి చెంద్రక్కా?" అన్నది.

"ఇది నెల్లూరేలేఁ యీడ నాకేంపని?... మీ కోసమే వచ్చినా గూడూర్లో నువ్వొచ్చి దిగితే నీతో



కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

- హరి.

మాట్లాడనిచ్చేట్టుండారా మాబోటోళ్ళని.. మనూరి రెడ్లూ, నాయుళ్ళూ, కాలేజీవోళ్ళూ అంతా నీకోసం ఎదురుచూస్తా వుండారు. అందుకే ముందుగా వొచ్చినా?" గసపోస్తూ అంది చెంద్రమ్మ...

మళ్ళీ తనే "ఇదిగో మునెమ్మాఁ ఈ కోక ఏంబాగలేదు. యిప్పెయి మన పొదుపోళ్ళంతా తలా యాభయిరూపాయి లేసుకుని నీకు అయిదారు మంచి చీరలు కొని పెట్టుండారు.. నువ్వింక ఈ మాదిరిగా వుండడానికిల్యా. శుద్ధంగా వుండాల... ఫోను కొనుక్కోవాల" వెతుకులాడుతూ వచ్చిన ఆతృత, టెన్షన్ యింకా పూర్తిగా తగ్గకుండానే వూళ్ళో జరిగిపోతోన్న అనేకానేక పరిణామాల గురించి ఆపకుండా ఏకరువుపెట్టసాగింది...

అప్పటికి కూనిరాగాలాపి చెంద్రమ్మ మాటల్ని ఆసక్తిగా వింటోన్న కొండయ్య ఆనందాన్ని ఆపుకుంటున్న దానికి గుర్తుగా చర్మాన్ని కప్పుకున్నట్టున్న అతడి డొక్క ఎముకలు ఎగిరెగిరి పడుతున్నాయి.

ఎదురు సీట్లో కిటికీకానుకుని కూర్చుని చెంద్రమ్మకేసి తదేకంగా చూస్తోన్న మునెమ్మ కనుకొలకుల్లో నుండి బొట్లు, బొట్లుగా నీళ్ళు జారి గుండెల్ని తడుపుతున్నాయి... భర్త, చెంద్రమ్మ యిరువురూ చూడకుండా పైట కొంగుతో కళ్ళొత్తుకుంటోన్న మునెమ్మ మెడలో మొదటి పూలమాల పడింది.

ఏమిటాని ఆశ్చర్యంతో తలెత్తేలోపుగానే మరోటీ, మరోటీ సుమమాలలు ఆమె కంఠసీమని అలంకరించాయి.

"అమ్మాఁ నేను మైదాన ప్రాంత గిరిజన వేదిక అధ్యక్షుడ్ని- అరవై యేళ్ళ స్వతంత్ర భారతంలో మన వాళ్ళొక్కరికయినా శాసనసభా టిక్కెట్టు దొరికిందా?... మా వేదిక నిన్ను సన్మానించాలను కుంటోంది... నిన్ను సన్మానించడమంటే మమ్మల్ని మేము సన్మానించుకోడమే.. నిజానికి యిప్పుడే యిక్కడ దింపేసేవాళ్ళం కానీ మీ ఊళ్ళో అంతా మీకోసం ఎదురుచూస్తున్నారని తెలిసి ఎల్లుండి సాయంత్రం అయిదు గంటలకి సన్మాన కార్యక్రమం పెట్టుకున్నాం. తప్పక రావాలి యిద్దరూ..." అంటూ కొండయ్యకేసి తిరిగి నమస్కారం చెప్పాడాయన.

కొండయ్య ఖంగారుగా లేచినిల్చున్నాడు చేతులు జోడిస్తూ

కూర్చోవచ్చో, నిల్చోవాలో తెలీక చెంద్రమ్మ కూడ లేచి నిల్చుంది.

అసలేం జరుగుతుందో అర్థం కాకుండానే చిరునవ్వు నవ్వింది మునెమ్మ.

"జనరాజ్యం పార్టీ అధినేత జయచంద్ర మిమ్మల్ని హైదరాబాదుకు రమ్మని పిలిచినపుడు మీకేమన్పించింది?..." ఏదో పేపరు వాళ్ళంట ప్రశ్నించారు.

ముందు ఎక్కడ్నుంచి ప్రారంభించాలో, ఏం మాట్లాడాలో తోచలేదు మునెమ్మకి... అయితే ఎవరడిగినా నాలుగయిదు రోజుల్నుండీ ఆమె ఒకే రికార్డు విప్పుతోంది.

"మా ఊరి ఆడవాళ్లకి మంచీ, శెబ్రా చెప్పి, పొదుపు నేర్పించి అందర్నీ సార్క్ సమావేశానికి తీసుకెళ్ళాను నెల్లూరుకి... అక్కడ నన్ను మాట్లాడమని పిలిస్తే నాకు తోచిన, నాకు తెలిసిన విషయాలేవో చెప్పాను... జయచంద్ర గారికా విషయం తెలిసి సి.డి తెప్పించుకుని చూశారట... అందుకని నిన్న జరిగిన మహిళా సాధికారత మీటింగ్‌కి నన్నూ పిలిపించారు.."

"చాల మొహమాటంగా వుంది మునెమ్మ గొంతు...

జనాలకి మంచి చేయడానికి రాజకీయాల్లోకి వచ్చాడు జయచంద్ర. తగిన కార్యకర్తలను గుర్తించి వారికి సరయిన శిక్షణ, అవగాహన కల్పించి, ఆవేశకావేషాలకు గురికాకుండా వ్యక్తిగత లోపాలను, చెడు అలవాట్లను విడనాడాలని, ప్రజాసేవ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలన్నదే అతడి అభిమతం. మొత్తం మీద మార్పు రావాలన్నదే అతడి అభిలాష.. కాబట్టి అంతా మంచే జరుగుతుందనీ, ఆశించిన మార్పు వస్తుందనీ మునెమ్మ నమ్మకం.

టిక్కెట్టు ప్రకటించినందువల్ల మునెమ్మకేమీ కొత్తగా కొమ్ములు మొలిచినట్లుగా కూడ లేదు... రాజకీయాల్లోకి వచ్చినా, రాకపోయినా పొదుపు లీడరయినప్పట్నుంచి కూడ తన గ్రామంలో, తనమండలంలో తనకి లోబడి వున్న ప్రాంతమంతటా తిరిగి ఆడవాళ్ళందరినీ చైతన్యపరచడమే ధ్యేయంగా పెట్టుకుందామె.. మంచీ, చెడూ వాళ్ళకి నేర్పిస్తూ తాను కూడా స్వయంగా ఎన్నో విషయాలను నేర్చుకుంది... ధైర్యాన్ని తెచ్చుకుంది...

చాలమంది ఆడవాళ్ళకి యిప్పటికీ వారికి కావల్సిందేమిటో, వారి హక్కులేమిటో వారికి తెలీవు... వారి శక్తులేమిటో వారికి తెలియచెప్పాలి... చాలమంది తమ ఆడపిల్లల్ని బడికి పంపకుండా మూడో ఏటినుండే పనులు నేర్పిస్తున్నారు... చదువులేకపోవడం మూలంగా ప్రభుత్వం అమలు చేసే పథకాల గురించి వీరికి అవగాహన లేదు... ఆడవాళ్ళకి అన్నీ తెలిసేట్టు చేస్తే కుటుంబాన్నీ, సమాజాన్నీ కూడ బాగుపరచుకుంటారని మునెమ్మ ఉద్దేశ్యం...

“జనరాజ్యం పార్టీలో మిమ్మల్ని బాగా ఆకట్టుకున్న అంశాలేమిటి?” ప్రశ్నించాడు మరో విలేకరి....

“నా గుండుం... ఏంది నచ్చేది అంశాలు?” నోటిదాకా వచ్చి తమాయించుకున్నాడు కొండయ్య... వాళ్ళలా భార్యని శల్యపరీక్షలు చేయడం అతడికి నచ్చడం లేదు... తిప్పిచ్చి, మళ్లిచ్చి అడిగిందే అడిగి దేనికయినా జవాబు చెప్పలేకపోతే “హీ.... హీ” అని గేలి చేయడానికే అడుగుతున్నట్టున్నారు.. అనుకున్నాడతడు విసుగ్గా...

అయినా మునెమ్మ జంకలేదు.

“వేల సంవత్సరాలుగా అలవాటు ప్రభుత్వాన్ని లాగుతూ వస్తోన్న సమాజంలో మార్పు తీసుకురావడానికి మొదటి అడుగుగా అవినీతిని నిర్మూలించాలనడం నాకు బాగా నచ్చిన విషయం.... అంతే కాకుండా కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా పేదోళ్ళనీ, ఆడోళ్ళనీ, వికలాంగులనీ కూడ మనుషులుగా చూసి గుర్తించి గౌరవించడం... తగువులకి పోకుండా వేరే పార్టీ వాళ్ళు దాడి చేసినపుడు, దుందుడుకుగా ప్రవర్తించినపుడూ కూడ ద్వేషాన్నీ, పగనీ కాక పూలు పంచిపెట్టడం... కార్యకర్తలందరినీ సంయమనంతో వుండాలని కోరడం... యివన్నీ మనిషిగా బతకాలనుకున్న ఎవరికయినా నచ్చే తీరతాయి కదా...”

విలేకరులు, రైల్లో చుట్టూ వున్న ప్రయాణీకులు కూడ బిగ్గరగా అరుస్తూ చప్పట్లు చరిచారు...

గతంలో పొదుపు లీడరుగా పనిచేస్తూ, జిల్లాస్థాయి సార్క్ సమావేశాల్లో మాట్లాడినప్పటి మునెమ్మకీ... యిప్పటి మునెమ్మకీ మాటల్లో వచ్చిన తేడాని గుర్తించి కొంతమంది ఎగతాళిగానూ, మరికొందరు విలేకరులు మెచ్చుకోలుగానూ చూశారు.

కొండయ్యకీ, చెంద్రమ్మకీ గర్వంగానూ, మునెమ్మకి సిగ్గుతో కూడిన యిబ్బందిగానూ అన్పించింది...

మునెమ్మకీ, విలేకరులకీ మధ్య జరుగుతోన్న రాజకీయ సంభాషణలను వినడం కోసమన్నట్టుగా రైలు ఆగి, ఆగి వెళ్ళూ అవుటర్లో నిల్చిపోయింది....

“అయితే ప్రజాసేవ చేయాలంటే తప్పనిసరిగా రాజకీయాల్లో చేరాల్సిందేనా? జనరాజ్యం పార్టీ అధినేత కోట్లకు పడగలెత్తినవాడు కదా... బయటే వుండి మార్పును తీసుకురావచ్చు కదా....” అడిగాడొక విలేకరి...

కొండయ్య అతడికేసి గుర్రుగా చూశాడు.

నిజానికివన్నీ పార్టీ పెట్టిన పెద్దమనిషిని నేరుగా అడగాల్సిన ప్రశ్నలు... అక్కడ దమ్ములుండవు... యిక్కడ చీల్చి చెండాడుతారు... అనుకుంటూ భార్య ఏం చెప్తుందోనని చెవులు రిక్కించాడతడు.

రెండు నిముషాలు మౌనం తరువాత పెదవి విప్పిందామె.

“నేననుకుంటాను... అసలు రాజకీయాల్లోనే కాదు... ఏ రంగంలోనయినా ఆడవాళ్ళు చేసినంత బాగా మగవాళ్ళు ఏ పనీ... ఎప్పటికీ చేయలేరని... వేల సంవత్సరాలుగా మగాడు రాజ్యమేలుతూ వుండడం వల్లే యిదంతా యింత అస్తవ్యస్తంగా, అవినీతిమయంగా, అరాచకంగా వుంది. అదే స్త్రీల చేతికి రాజ్యాధికారమొస్తే అంకిత భావంతో ప్రజల సమస్యలని, ముఖ్యంగా, ఆడవాళ్ళ కష్టాలని అర్థం చేసుకుని నియోజకవర్గ ప్రజల్లో కలగలిసిపోయి నిస్వార్థంగా పనిచేస్తారని నా నమ్మకం...

ఒక మగాడు వందరూపాయలు సంపాదిస్తే యాభయిరూపాయలు మాత్రమే యింటికి ఖర్చుచేసి యాభయి రూపాయలు తన ఖర్చులకుంచుకుంటాడు. అదే స్త్రీ అయితే వందరూపాయలూ కుటుంబానికే ఖర్చు పెడుతుంది... అన్నం చాలనపుడు యింట్లో అందరి పేగుల్ని చల్లారుస్తుంది.. తను తినడం మానేసి.... ఆడవాళ్ళు చాల బాధ్యతగా, నిస్వార్థంగా చేస్తారు ఏ పనయినా....” ఆత్మ విశ్వాసాన్ని మించిన తపస్సు లేదన్నట్టుగా చెప్పింది మునెమ్మ...



రవీంద్రభారతి హైదరాబాద్‌లో రసమయి ఆధ్వర్యంలో జరిగిన సభలో “కవితాభిషేకం” గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సి. నారాయణరెడ్డి. చిత్రంలో సురేఖామూర్తి, తిరుమల శ్రీనివాసాచార్య, జె. బాపురెడ్డి, ఎల్లూరి శివారెడ్డి, పి. విజయబాబు, గ్రంథకర్త ఎం.కె. రాము, పి.ఎల్. సంజీవ్‌రెడ్డి, ఆలపాడు బాపన్న ఉన్నారు.

"అందుకేఁ నీతి ఎక్కువయిపోతుందనే ముప్పయి మూడు శాతం బిల్లు పాసే కావడంలేదు" వ్యంగ్యంగా అన్నాడో విలేకరి.

అమె సమాధానం చెప్పలేకపోతే ఎద్దేవా చేయడానికి సిద్ధంగా వున్నవాళ్ళంతా విస్తుపోయి చూస్తుండగా కొంతమంది యిటువంటి కామెంట్లు విసిరి సంతృప్తి చెందారు...

రైలు పెట్టంతా నవ్వులూ, చప్పట్లూ, మెచ్చుకోళ్ళతో గాలిలోకి ఎగిసిపడింది... రాష్ట్రపు గాలంతా మునెమ్మ మీదికి వీస్తున్నట్లుగా వుంది.

అవుటర్లో నుండి కదిలి రైలు గూడూరు చేరేదాకా యిదే తంతు

వాళ్ళు అడగడం... మునెమ్మ చెప్పడం

* * *

"అంతేగదయితే? పార్టీ పెట్టకముందు నుంచీ చిన్నదానికీ, పెద్దదానికీ చేతులు కాల్చుకుంటూ మీటింగులు పెట్టి, బ్యానర్లు కట్టి, జనాన్ని తోలి ఎంతెంత చేసినారు మహేంద్రబాబు, పెదనాయుడు, రమేష్ రెడ్డి... వాళ్ళు గమ్మునుంటారా? మనకి తెలీదా? ఆయన టిక్కెటిస్తాను రమ్మంటే ఈమి వూపుకుంటూ అయిద్రాబాదుకి పొయ్యింది... యిదేమన్నా సినిమాటికెట్టా? ఎవరికంటే వాళ్ళకీయడానికి యిప్పుడేమైంది? "సందు దొరికింది గదాని చెడామడా చెరుగుతోంది పెద్దాడబిడ్డ చాట్లోని బియ్యాన్ని...

చాట ఎగిరి పడిపోయిందేమో నన్పించింది మునెమ్మకి.

విరిగిన కాలు పెడుతోన్న నొప్పిని భరాయించలేక భారంగా మూలుగుతున్నాడు కొండయ్య. ఎవరయినా ముట్టుకుంటారేమోనని ముందుగానే బిగ్గరగా అరుస్తున్నాడు... కొండయ్య కాళ్ళ దగ్గర పక్కనే కూర్చుని పక్కటెముకలు ఎగిరిపడేలా వెక్కిళ్ళు పెడుతోంది అత్త నరసమ్మ.

వాడలోని వాళ్ళంతా ఒక్కొక్కరూ కొండయ్యని పరామర్శించడానికన్నట్లుగా వచ్చి రకరకాలుగా మాట్లాడి వెళ్తున్నారు.

అందరి మాటల్లోని సారాంశము ఒకటే...

"అపూట కాపూట కూలి చేసుకుని పొట్టనింపుకునే వాళ్ళం... మనకెందుకీ రాజకీయాలు... గమ్మున మొగుడికి వొండిపెట్టి యింట్లో పడుండొచ్చు కదా... నాయుళ్ళు, రెడ్లు ఎమ్మెల్యేలవతారు గానీ పేదోళ్ళు, అందునా ఆడోళ్ళు ఎమ్మెల్యేలవతారా యాడయినా? అన్నదే...

అప్పటిదాకా ఎంతో ఆనందంగా, ఆతృతగా, గర్వంగా వుండిన కొండయ్య ఈ సంఘటనతో డీలా పడిపోయారు... విరిగిన కాలూ, తల్లి ఏడుపూ వచ్చి వెళ్తోన్న వారి గేలిమాటలూ అతడిని మరింత నిరుత్సాహానికి, నిస్పృహకి గురి చేస్తున్నాయి...

అత్యంత ధైర్యంగానూ, నమ్మకంతోనూ, జరిగినదాన్ని ఏమాత్రం లక్ష్యపెట్టకుండానూ వున్నది మునెమ్మ మాత్రమే...

ఇప్పుడిప్పుడే దళితులు




చైతన్యమవుతూంటే, రాజ్యాధికారం హస్తగతం చేసుకుంటూంటే చూస్తూ భరించలేక వారిని అణిచివేయడానికి పెద్దవాళ్ళు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు...

పేదోళ్ళ భూమిని ఎన్నో ఏళ్ళుగా దున్నుకుని సొమ్ము చేసుకుంటోన్న ఏనుగుల రాజారెడ్డితో పోరాటం చేసి తమ నేలని తాము దక్కించుకున్నారు గిరిజనులు యిటీవల... దానికి నాయకురాలు మునెమ్మ అందుకే అంతా ఆమె మీద గుర్రుగా వున్నారు...

పదవి లేకుండానే యింత ఎగిరెగిరి పడుతోంటే, పదవి వస్తే యింక పట్టగలమా అన్నకసి, ఉక్రోషం కలగలపి నెల్లూరులో సన్మానంలో పాల్గొని, తన ఆలోచనలని ఆచరణలోకి తెచ్చే విషయమై స్పష్టంగా మాట్లాడి తిరిగివస్తూండగా రాత్రి దంపతులిరువురి పైనా దాడి జరిగింది.

మునెమ్మని బెదిరించడమో, కాళ్ళు విరగ్గొట్టి మూలన కూచోబెట్టడమో. అదీ కాదంటే చంపడమో వాళ్ళ ఆలోచన కావచ్చు... అయితే ఎక్కువగా గాయపడింది కొండయ్యా... శారీరకంగా, మానసికంగా కూడా...

వెంట్రుకవాసిలో తప్పిపోయిన మరణాన్ని పదేపదే వివిధ కోణాల్లో నుండి దృశ్యమానం చేసి యింటిల్లిపాదినీ వొణికించి పోతున్నారు వచ్చిన వాళ్ళంతా... ఇంట్లో అంతా మనకీ రాజకీయాలు వద్దనే వద్దు పొట్ట చేత్తో పట్టుకుని యాడకయినా పారిపోదాం అన్న స్థితికి వచ్చేశారు... నరసమ్మ అయితే 'వున్న నాలుగు సామాన్లనీ ఒక్కొక్కటిగా గోతాలకేసి కడ్తోంది...

ఇదివరలో వచ్చిన ఫోను బెదిరింపుల్ని పట్టించుకోనట్టుగానే యిప్పుడీ సంఘటనను కూడ పెద్దగా ఖాతరు చేయలేదు మునెమ్మ...

తనకు వీలయినప్పుడల్లా నియోజకవర్గమంతా తిరిగి ఓటర్లను కలుస్తూనే వుందామె... అందుకోసం డబ్బు మంచినీళ్ళలా ఖర్చయిపోతున్నా లెక్క చేయక ఎప్పటికప్పుడు నియోజకవర్గపు పరిస్థితిని తనంతట తానుగా ఫోనుచేసి జయచంద్రతోనో, లేదా పక్కనే వున్న కార్యకర్తలతోనో సమీక్షిస్తూనే వుంది.

పర్యవసానాలను గురించి ఏమాత్రం పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతోన్న కర్మయోగిలా వుందామె...

* * *

'రంగు పూసుకునే వాళ్ళకి రాజకీయాలెందుకు'

'రాజకీయాల్లోకి రావడానికి, ప్రజాసేవ చేయడానికీ మనసుండాలి' మనసుకు రంగు పూసుకోకపోతే చాలు".

అంటూ ప్రారంభమై అటువైపు, ఇటువైపు పార్టీలలోని మహిళా నాయకులు వ్యక్తిగత దూషణలతో, పరుషమైన పదజాలంతో అత్యంత జుగుప్సాకరంగా, సంస్కారహీనంగా కొట్లాడుకుంటూ వున్నారు.

వాళ్ళని చూసి జాలితో మూలిగింది మునెమ్మ మనసు.

రాజకీయమంటే అన్ని వర్గాల మనుషుల్ని చైతన్యవంతం చేసి ఒక సమ సమాన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలి కానీ యిట్లా దిగజారిపోయి

నీచంగా మాట్లాడుకోవడం ఎంత అసహ్యం...

చప్పున లేచి టీవీ ఆఫ్ చేసి దీర్ఘంగా నిట్టూర్చిందామె.

పురుషుడు స్త్రీలను అనేక విధాలుగా ఉపయోగించుకుంటాడు. రాజకీయాల్లో ఆమె శక్తియుక్తులను, నిజాయితీ నిబద్ధతలను కాకుండా దువ్వి దువ్వి ఆమె చేత మొరిగింపచేస్తున్నాడు...

కొండయ్య పైకి లేచి పై గుడ్డ తీసి విదిలించుకుని కుంటుకుంటూ పొలం వైపుగా వెళ్ళాడు... కొండయ్యా, తనూ ఒకరినొకరు పట్టించుకోకుండా వున్న ఈ కొత్త వాతావరణం మనసుని పిండేస్తోంది మునెమ్మని...

పెళ్ళయిన్నాటి నుండీ యిద్దరూ కలిసికట్టుగా కూలిపనులకెళ్ళి తినో తనకో దాచిదాచి పొలం కొనుక్కోవడం, పిల్లల్ని మంచి బడిలో చేర్చడం ప్రతి పనినీ యిద్దరూ కలిసి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం, ప్రతీ సందర్భంలోనూ వాడవాళ్ళందరికీ అండగా నిలబడ్డం, ఆదర్శ జంటగా పేరు తెచ్చుకోవడం యివన్నీ ఒక్కొక్కటిగా ఆమె హృదయ ఫలకం మీద నిలిచి, మాయమవుతూ అలజడికి గురిచేస్తున్నాయి...

మెల్లిగా తనూ లేచి అతడిననుసరించింది, నరసమ్మ గొణుగులూ తిట్లూ నేపథ్యంగా..

సునామిలో యిల్లూ, భార్యాపిల్లలూ కొట్టుకుపోయాక అసహాయతతో, నిస్పృహలో కూరుకుపోతూ ఒడ్డున నిలబడి చూస్తోన్న మనిషిలా వున్నారు కొండయ్యా...

ఊరోళ్ళకమ్మేసిన అరెకరా మడిచెక్కలో మళ్ళీమళ్ళీ జాతరలో తప్పిపోయిన కుర్రాడిలా తిరుగుతున్నాడతడు.

వాళ్ళ శనగ చెట్లల్లో కలుపు పెరకబోతాడు.

మోటారేసి నీళ్ళు పట్టబోతాడు... చెట్టు పెరికి కాయ పట్టిందా, లేదా చూస్తాడు... కాదంటే వలవలా ఏడుస్తున్నాడు.

"నా పొలం నాక్కావాలి" అంటూ నవ్వుతాడు.

టిక్కెట్టు ప్రకటించాక వున్న ఒక ఎకరంలోనూ అరెకరా అమ్ముకుని ఆడంబరంగా ఖర్చులు పెట్టుకున్నందుకు తనను తానే హింసించుకుంటాడు. మబ్బుల్లో నీళ్ళు చూసి ముంత వొలకబోసుకున్నందుకు పదే పదే మదనపడతాడు.

భయంకరమైన బాధ, కోపం, ఆవేదనా కలగలిపి అతడ్ని పిచ్చివాడిని చేస్తున్నాయి... మనసునీ, చూపునీ అంతర్ముఖం చేసుకుంటున్న దానిలా మౌనంగా కూర్చుని వుంది మునెమ్మ. కొండయ్య గుండెల్లో నుండి వెలువడుతోన్న బాధ ఆమె హృదయంలోకి చొచ్చుకుపోతుంది.

పార్టీ తనని శాసనమండలికి పంపిస్తానని మభ్యపెట్టడం వెనుక యిక్కడి స్థానిక నాయకుల ప్రమేయం, ఖర్చు... ఎన్నికల ఖర్చు ప్రస్తావన చాలా వుందని మునెమ్మకి అర్థమవుతూనే వుంది... మౌనంగా వుండడానికి వీల్లేని స్థితి.

ఈ చుట్టుపక్కల పదారు పల్లెల్లోని ఆడవాళ్ళంతా, తాను నియోజకవర్గంలో తిరుగుతున్నపుడు తనకి నీరాజనాలు పట్టిన మగవాళ్ళంతా, తన పొదుపు గ్రూపులన్నీ ఆగ్రహోదగ్రులయి కదులుతున్నారు... తనకి టికెట్టు ప్రకటించిననాడు యెంత ఆనందపడి పొంగిపోయారో, ఈ రోజున అంత నిస్పృహకి గురయి, అంత కడుపుమంటలో కూరుకుపోయారు.

తమ జీవితాల్లో ఒక అద్భుతమైన మార్పు రాబోతోంది అని ఆశపడిన వాళ్ళంతా నిరుత్సాహపడిపోయారు.

ఇప్పుడు తాను వేయబోయే అడుగు, తీసుకోబోయే నిర్ణయం తనొక్కదానికి సంబంధించింది కాదు. తనని నమ్ముకున్న వాళ్ళందరిదీ అవుతుంది.

ఆడా, మగా అంతా ఒక్కొక్కరే వస్తున్నారు... మునెమ్మతో మాట్లాడుతున్నారు వెళ్తున్నారు... అంతా తమకు తోచిన వితరణతో మునెమ్మకి ధైర్యాన్నిస్తున్నారు. ఆడవాళ్ళే అయినా, పేదవాళ్ళే అయినా ప్రభంజనంలా కదిలి మార్పు రావలసిన అవసరాన్ని నొక్కి చెప్తున్నారు... ఇప్పుడున్నదయితే సరయింది కాదు... మార్పుతో కూడన ఒక సమ సమాజం రావాలన్నదే వాళ్ళందరి ఆశ... తీవ్రంగా తమలో తామే చర్చలు జరుపుతున్నారు... ఊళ్ళో తమని ఆదరించే బడి అయ్యవారు, బ్యాంక్ మేనేజరు వంటివారి వద్దకెళ్ళి సలహాలు తీసుకుంటున్నారు...

రాత్రే పగలు, పగలే రాత్రిగా ఎన్నికల కోలాహలంతోనూ, అంతరంగమో, బహిరంగమో, రహస్యమో అయిన తీవ్ర చర్చలతో రోజులు ముందుకు సాగుతున్నాయి.

✱ ✱ ✱

చీకటి రాజ్యంలో చంద్రకాంతులు ప్రసరించినట్లుగా నల్లవాడలో సూర్యుడు ఎర్రగా ఉదయించాడు ఆరోజు.

"చాలా ధైర్యం చేస్తున్నావు మునెమ్మా! ప్రతిష్ఠాత్మకమైన నియోజకవర్గం యిది... అందునా యిన్ని ప్రధాన పార్టీల మధ్య, హేమా హేమీల ముందు నువ్వెలా వ్యక్తిగతంగా నిలబడగలవు?" విలేకరులు చుట్టుముట్టారామెని...

అభావంగా వున్న ఆమె చూపుల్లోనుండి అర్థాన్ని వెతుక్కోవడం వాళ్ళకి కష్టమైపోయింది...

ప్రజల పట్ల ప్రేమ, ఊరివట్ల అభిమానమూ, సమాజం పట్ల బాధ్యతా వుంటే చాలు... మన నిజాయితీయే డబ్బు, మన నిబద్ధతే మద్యం ఓట్లడుక్కోవడానికి అన్నట్టు నిటారుగా వుందామె...

"అయిందేదో అంతా మనమంచికే అయింది.

అవబోయేది అంతా మనమంచికే...

గెలవడం, గెలవకపోవడం కాదు...

మనశక్తి ఏమిటో మనకి తెలుస్తుంది..."

ఆమెలోని ఉద్యమస్ఫూర్తికి పోరాటపటిమకి దిగ్భ్రాంతి చెందారు విలేకరులు... ఆమె వెనుకనున్న మహిళాశక్తిని చూసి విస్తుపోయారు. పారదర్శకమైన లేత నీలపు గాజుగోళంలో నుండి ఖచ్చితంగా పలుకుతోంది మునెమ్మ గొంతు... పూర్తి ఆకాశంతో చేసిన ఆగోళం మునుపటి కంటే దృఢంగా, దర్పంగా, ధీమాగా వుంది. ❖



కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

వడ్డేపల్లి వెంకటేష్.